క్లుప్తంగా

ఫుట్‌బాల్ రన్నర్స్‌గా దేవపట్ల


రన్నర్స్‌గా నిలిచిన జట్టుతో పాఠశాల బృందం

సంబేపల్లె : దేవపట్లలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు స్టేట్ ఫుట్‌బాల్ విభాగంలో రన్నర్స్‌గా నిలిచారని ప్రిన్సిపల్ బి.శ్రీకళదేవి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణవేణిలు తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో భాగంగా ఫుట్‌బాల్ విభాగంలో రన్నర్స్‌గా నిలిచిన కావ్య, వినూత్న, మల్లిక, విజయలక్ష్మి, బేబి ప్రియాంక, రెడ్డికౌసల్య, యామిని, రెడ్డిజ్ఞానేశ్వరి, హారికలను ఉపాధ్యాయులు అభినందించారు.

ద్విచక్ర వాహనాలు ఢీ

గాలివీడు : మండల కేంద్రం హైస్కూల్ దగ్గర మంగళవారం ద్విచక్రవాహనాలు ఢీ కొన్న సంఘటన చోటుచేసుకుంది. హైస్కూల్ సమీపంలో ఉన్న ఖయ్యూమ్ బాషా, గొర్లవాండ్లపల్లెకు చెందిన నాయుడు వాహనం పరస్పరం ఢీ కొనడంతో ఖయ్యూమ్ తల, ముఖానికి బలమైన గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో 108లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

'రైల్వేకి న్యాయం చేయండి'

నందలూరు : దశాబ్దాలపాటు ఒక వెలుగు వెలిగిన నందలూరు రైల్వేకు న్యాయం చేయాలని నాగిరెడ్డిపల్లి సర్పంచ్ జంబు సూర్యనారాయణ, టీడీపీ నేతలు గుంతకల్ డివిజన్ రైల్వే అడిషనల్ మేనేజర్ సుధాకర్‌కు విన్నవించారు. మంగళవారం నందలూరుకు విచ్చేసిన ఏడీఆర్‌ఎంను వారు కలిసి నందలూరు రైల్వే సమస్యలపై వినతిపత్రం అందజేశారు. గతంలో నందలూరులో అన్ని రైళ్లు నిలబడేవని, ప్రస్తుతం అనేక రైళ్లకు స్టాపింగ్ ఎత్తివేయడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని రైళ్లను నిలిపేలా కృషి చేయాలని కోరారు.

3 నుంచి నవరాత్రి ఉత్సవాలు

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేట సమీపంలోని శ్రీ దర్బారు సాయి నగర్‌లో వెలసిన శ్రీ సద్గురు దర్గా మాతాజీ శరన్నవరాత్రి ఉత్సవాలు 3వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని దర్బారు సాయి భక్తులు తెలిపారు. 3వ తేదీ గురువారం మహాగణపతి పూజ, స్వస్తివాచనం, సాయంత్రం రాజరాజేశ్వరి దేవి అలంకారం, 4న శుక్రవారం భవానీ దేవిగా, 5న శనివారం శారదాదేవిగా, 6న అన్నపూర్ణాదేవిగా, 7న బిల్వవృక్ష నివాసిని పార్వతిదేవిగా, 8న గజలక్ష్మీదేవిగా, 9న ఉదయం బిందెసేవ, సాయంత్రం సరస్వతిదేవి అలంకారం, 10న దుర్గాష్టమి మహిషాసురవర్ధిని దేవిగా, 11న గాయత్రి దేవిగా, 12న విజయలక్ష్మి దేవి అలంకారం, పల్లకీ సేవ ఉంటుందన్నారు.

ఎక్సైజ్ సీఐగా రాజశేఖర్



సిద్దవటం : సిద్దవటం ఎక్సైజ్ పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా రాజశేఖర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పనిచేసిన నాగరాజు చిత్తూరు జిల్లా పలమనేరుకు బదిలీ కావడంతో ఆ స్థానంలో కర్నూల్ జిల్లా నుంచి సీఐగా పనిచేస్తున్న సిద్దవటం ఎక్సైజ్ సీఐగా రాజశేఖర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు.

ప్రేమాలయంను సందర్శించిన జడ్జి

రామాపురం : మండల పరిధి బండపల్లె గ్రామం టోల్‌గేట్ వద్ద గల ప్రేమాలయం వృద్ధాశ్రమాన్ని లక్కిరెడ్డిపల్లె ఫస్ట్ క్లాస్ జూనియర్ మేజిస్ట్రేట్ ఫైజున్నీసా మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో వాతావరణ పరిస్థితులు, వృద్ధుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులకు కల్పిస్తున్న సేవలపై మేనేజర్‌ను ఆరా తీశారు. వృద్ధులను ప్రేమానురాగాలతో చూసుకోవాలని సిబ్బందికి సూచించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన


భోజనాన్ని విద్యార్థులకు వడ్డిస్తున్న ఎంపీడీఓ

వీరబల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని మంగళవారం ఎంపీడీఓ మల్లేశ్వరి పరిశీలించారు. ఇందులో భాగంగా ఆమె స్వయంగా పిల్లలకు భోజనాలు వడ్డించారు. భోజనాలు రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలస్థాయిలో జరిగిన చెకుముకి విజ్ఞాన శాస్త్ర ప్రతిభా పరీక్షలలో టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

రైల్వేకోడూరు అర్బన్ : మహిళలు స్వయం ఉపాధి శిక్షణ పొంది ఆర్థికంగా ఎదగాలని గ్లోబల్ ట్రస్ట్ చైర్మన్ పార్థసారథి మంగళవారం తెలిపారు. పట్టణంలోని కార్యాలయంలో కెనరా బ్యాంక్ స్వయం ఉపాధి శిక్షణలో భాగంగా మహిళలకు మగ్గం వర్క్, జూట్ బ్యాగుల తయారీలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మగ్గం వర్క్ 30 రోజులు, జూట్‌బ్యాగుల తయారీకి 15 రోజులపాటు శిక్షణ ఇస్తామని తెలియజేశారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి


రాయచోటి అర్బన్: విజేతలకు జ్ఞాపికలను అందజేస్తున్న ప్రిన్సిపల్, జేవీవీ నేతలు


సిద్దవటం: పరీక్షలో విజేతలైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాయచోటి అర్బన్ : విద్యార్థులు చిన్నతనం నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని డైట్ ప్రిన్సిపల్ జ్యోతిర్మయి అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక డైట్ సభా భవనంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనను పెంపొందించుకుని శాస్త్రీయ సమాజాన్ని నిర్మించాలన్నారు. భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా ఎదగాలని, దేశానికి మంచి సేవలను అందివ్వాలంటూ కోరారు. కంటి వైద్యుడు రెడ్డెన్న మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ప్రజల్లో మూఢ నమ్మకాలను తొలగిస్తూ, శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం పాటుపడుతోందంటూ కొనియాడారు. జేవీవీ జిల్లా కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి మండలం నుండి టాలెంట్ టెస్టు రాసిన ఆరుమంది విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈనెల 27న డైట్‌లో జిల్లాస్థాయి సైన్స్ చెకుముకి పరీక్షలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో జేవీవీ నేతలు ఆంజనేయులు, డైట్ అధ్యాపకులు అసదుల్లా బాషా, రెడ్డెప్పరెడ్డి, శ్రీదేవి, కళావలి, ఆంజనేయులు, బాబా ఫకృద్దీన్, రవీంద్రనాథరెడ్డి, ఉపాధ్యాయులు, జేవీవీ నేతలు పాల్గొన్నారు.

సిద్దవటం : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయిలో విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్టు పోటీలను నిర్వహించామని జేవీవీ జిల్లా అధ్యక్షుడు సమీర్ బాషా తెలిపారు. మండల స్థాయిలో జరిగిన ఈ చెకుముకి పోటీలు నిర్వహించారు. టాలెంట్ టెస్టు ప్రశ్న పత్రాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెకుముకి టాలెంట్ టెస్టు అనేది విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన వారి ఆచరణాత్మక, శాస్త్రీయ పరిజ్ఞానాన్ని సవాల్‌చేసే పోటీ పరీక్ష అన్నారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు సమీర్‌బాషా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకొని భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. మండల స్థాయి పోటీ పరీక్షలో మొదటి స్థానం భాకరాపేట జెడ్పీస్కూల్, 2వ స్థానం సిద్దవటం జెడ్పీ హైస్కూల్, మూడవ స్థానం 11వ బెటాలియన్ హైస్కూల్, ప్రైవేటు పాఠశాల్లో మొదటి స్థానం శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, మాధవరం. రెండవ స్థానం సిద్దవటంలోని శ్రీ నలంద హైస్కూల్, మూడవ స్థానం మాధవరం, హ్యాపీకిడ్స్ హైస్కూల్ విద్యార్థులను ఎంపికయ్యారు. కార్యక్రమంలో జేవీవీ మండల అధ్యక్షుడు రామకేశవ, సైన్స్, గణిత ఉపాధ్యాయులు శ్రీనివాసులు, హరికొండయ్య, వెంకటసుబ్బయ్య ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుండుపల్లె : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ యాజమాన్యంలో తిమ్మసముద్రం పాఠశాలతోపాటు ప్రైవేటు యాజమాన్యంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ మొదటి స్థానాన్ని సాధించారు. విద్యార్థులు జిల్లా స్థాయి పోటీ పరీక్షలకు ఎంపికైనట్లు సుండుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయన్న తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థిని ఎస్.అక్షర, అలాగే తొమ్మిదో తరగతి విద్యార్థి డి.సాయి సుమంత్, ఎనిమిదవ తరగతి విద్యార్థి సాయి ఆదిత్యలు జిల్లాస్థాయికి ఎంపికయ్యారన్నారు.

నందలూరు : మండలస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు పోటీలు సమగ్ర శిక్ష అభియాన్, జన విజ్ఞాన వేదిక సంయుక్త నిర్వహణలో నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ మండలస్థాయి టాలెంట్ టెస్టు పోటీలో మొత్తం 15 టీమ్‌ల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ఫస్ట్ ప్రైజ్ విన్నర్‌గా మహాత్మ జ్యోతిబాయి పూలే బీసీ గురుకుల పాఠశాల, సెకండ్ ప్రైజ్ పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, థర్డ్ ప్రైజ్ నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ప్రైవేటు పాఠశాలల విభాగంలో సెయింట్ జోసెఫ్ పాఠశాల మొదటి ప్రైజ్ విన్నర్‌గాను, సెకండ్ ప్రైజ్ విన్నర్‌గా అక్షర గొబ్బిళ్ల పాఠశాల, మూడో ప్రైజ్ విన్నర్‌గా ఆడపూరు సాయి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు జనవిజ్ఞాన వేదిక అన్నమయ్య జిల్లా అధ్యక్షులు షేక్ రౌఫ్ బాషా, మండల శాఖ అధ్యక్షులు జి కృపానందంలు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్, మెమెంటోలను నందలూరు ఉన్నత పాఠశాల హెచ్ఎంఎస్ శ్రీనివాసులు అందజేశారు.

పుల్లంపేట : మండల స్థాయిలో జరిగినటువంటి చెకుముకి టాలెంట్ టెస్టులో విన్నర్‌గా ప్రథమ బహుమతిని శ్రీ ప్రత్యూష హైస్కూల్ విద్యార్థులు బి.కరిష్మా, పదోతరగతి, జి.శివ విశాల్, 9వ తరగతి, కె.లాస్య 8వ తరగతి విద్యార్థులు గెలుపొందారు. అలాగే ద్వితీయ బహుమతిని శ్రీ శాంతినికేతన్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు, తృతీయ బహుమతిని శ్రీ శివపార్వతీ హైస్కూల్ విద్యార్థులు గెలుపొందారు. ఎంఈఓ జి చక్రాధర్ రాజు గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.


పుల్లంపేట: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ


సుండుపల్లె: జిల్లాస్థాయి చెకుముకి పరీక్షలకు ఎంపికైన విద్యార్థులు


నందలూరు: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

భరతజాతి గుండెచప్పుడు మహాత్మ గాంధీ


గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి (జగదాంబసెంటర్) : భరతజాతి గుండెచప్పుడు మహాత్మ గాంధీ అని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సత్యం, అహింసలు గాంధీజీ నమ్మిన సిద్ధాంతాలని, సహాయ నిరాకరణ, సత్యాగ్రహం ఆయన ఆయుధాలన్నారు. కొళాయి కట్టి, చేత కర్ర పట్టి, నూలు ఒడికి, మురికివాడలు శుభ్రం చేసి, అన్ని మతాలు ఒక్కటేనని చాటి చెప్పి రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్య పాలనకు చమరగీతం పాడారన్నారు.

అజాత శత్రువు లాల్‌బహదూర్‌శాస్త్రీ

లాల్‌బహదూర్‌శాస్త్రి దేశ రెండవ ప్రధానిగా భారతీయుల హృదయాలలో నిలిచిన అమరజీవి అన్నారు. అజాత శత్రువుగా పేరు పొందిన ఆయననే పదవులు వరించాయన్నారు. మహాత్మ గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రీల దేశభక్తి, చిత్తశుద్ధి, నిజాయితీ, సేవాభావాలు అందరికీ ఆదర్శం కావాలని ఆకాంక్షించారు. ఆ మహనీయుల అడుగుజాడల్లో నడచి వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఆ మహనీయుల జయంతుల సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి వారికి నివాళులు అర్పించారు.

గాంధీజీ కలలు నెరవేరుద్దాం

రైల్వేకోడూరు అర్బన్ : గాంధీజీని కలలు కన్న దేశం కోసం అందరూ కృషి చేయాలని ప్రిన్సిపల్ భాస్కర్ రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ముందస్తు గాంధీ జయంతిని నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ యువత గాంధీ మార్గంలో నడిచినప్పుడే గ్రామ స్వరాజ్యం ఏర్పడుతుందన్నారు. ఆయన అహింసా మార్గాన్ని ఎంచుకోవాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ దేశ భక్తి పెంపొందించినపుడే దేశం అన్నిరంగాలలో అభివృద్ధి చెందుతుందని చెప్పారు. యువతీయువకులకు ఓటుహక్కు నమోదు పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటలతో ఆరోగ్యం, మనోవికాసం


సంబేపల్లె: క్రీడా సామగ్రిని అందిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె : ఆటలు విద్యార్థులకు ఆరోగ్యం, మనోవికాసాన్ని కలిగిస్తాయని రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో చదవువుతున్న విద్యార్థులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పిల్లలు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రాయచోటిలో క్రీడా పాఠశాల ఏర్పాటు చేయడమే కాకుండా ఇండోర్‌గేమ్స్ సదుపాయాలను కల్పిస్తామన్నారు. అనంతరం ఆదర్శ పాఠశాలలో చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు.


వీరభద్రస్వామిని దర్శించుకున్న మంత్రి


రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామిని మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి దర్శించుకున్నారు. మంగళవారం ఆయన ఆలయానికి రాగానే జిల్లా దేవాదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్, ఆలయ ఈఓ డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించి తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, సిబ్బంది కలసి తమను రెగ్యులర్ చేయాలని కోరగా ఆయన స్పందించి దీనిపై ఉన్నతాధికారులతో చర్చించి న్యాయం చేస్తానని చెప్పారు. ఆలయానికి ఎదురుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటం వలన చాలా ఇబ్బంది ఉందని ఆయనదృష్టికి తీసుకెళ్లారు. దీనిపై అధికారులతో మాట్లాడి త్వరలో పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. అనంతరం ఆయనకు దసరా మహోత్సవాలలో పాల్గొనాలంటూ ఆహ్వాన పత్రికను అందజేశారు.

విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

రాయచోటి అర్బన్ : సర్దుబాటు చార్జీల పెంపు ప్రతిపాదనను విద్యుత్ నియంత్రణ మండలి వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పోతగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ నియంత్రణ మండలి పేరుతో రూ.7200 కోట్ల సర్దుబాటు చార్జీల భారాన్ని ప్రజలపై మోపేందుకు ప్రభుత్వం సిద్ధం అయ్యిందంటూ ఆరోపించారు. 2022–23లో వినియోగించిన విద్యుత్‌పై అదనంగా సర్దుబాటు చార్జీలు వసూలుపై రాష్ట్రవిద్యుత్ నియంత్రణ మండలి ఇటీవలే బహిరంగ ప్రకటన విడుదల చేసిందన్నారు. ప్రతిపాదనలపై అక్టోబరు 14లోపు అభ్యంతరాలు తీసుకుని, 18న బహిరంగ విచారణ చేస్తామంటూ ప్రకటించారన్నారు. ఎన్నికల ముందు కూటమి నేతలు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్‌చార్జీలు పెంచబోమని, తగ్గిస్తామంటూ చెప్పి ఇప్పుడు పెంపు ప్రతిపాదనలు పెట్టడం ప్రజలను వంచించడమేనంటూ చెప్పుకొచ్చారు. పెంపు ప్రతిపాదనను ఉపసంహరించుకోకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామంటూ ఆయన హెచ్చరించారు.

ఆకట్టుకున్న ముందస్తు దసరా వేడుకలు


రాయచోటి టౌన్: అమ్మవారికి పూజలు చేస్తున్న ఉపాధ్యాయులు


రాజంపేట రూరల్: వేషధారణలో ఉన్న విద్యార్థులతో ఎంఈఓ రఘునాథరాజు

రాయచోటి టౌన్ : దసరా పండుగ అంటేనే మన భారతీయ సంప్రదాయాలను తెలియచేస్తుందని నారాయణ స్కూల్ ఏజీఎం శంకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాయచోటి నారాయణ స్కూల్లో ముందస్తు దసరా మహోత్సవ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని అందంగా అలంకరించి పూజలు నిర్వహించారు. దసరా ఉత్సవాల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఖాదర్ వలి, వైస్ ప్రిన్సిపల్ యువరాజు, సుగణ వేణి, నందిని, ఏఓ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట రూరల్ : ప్రతి విద్యార్థి జీవితంలో దసరా పండుగ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో వెలుగులు నిండాలని ఎంఈఓ కొండూరు రఘునాథరాజు కోరారు. స్థానిక థమ్సప్ గోడౌన్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన చెర్రీస్ స్కూల్లో తొలిసారి ముందస్తు దసరా ఉత్సవాలను కరస్పాండెంట్ రాఘవరెడ్డి ప్రేమలత, ఎండీ రాఘవరెడ్డి వెంకటేశ్వరరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చెర్రీస్ స్కూల్ సీఈఓ రంగప్రసాద్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్దవటం : మండల కేంద్రం పరిధి ఎగువపేటలో ఉన్న శ్రీ సాయి హైస్కూల్‌లో మంగళవారం ముందస్తు దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ రేవతిదేవి మాట్లాడుతూ విద్యార్థులకు దసరా విశిష్టతను తెలియజేయడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థినులు ధరించిన అమ్మవార్ల వేషధారణలు ఆకట్టుకున్నాయి. బొమ్మల కొలువు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ముగ్గురు దివ్యాంగుల పింఛన్‌లు తొలగింపు


దాసరి నారాయణమ్మ

సిద్దవటం : మండలంలో ముగ్గురు మహిళలకు అంగవైకల్యం పెన్షన్‌లను అక్టోబర్ నెలలో ఇవ్వలేదని పింఛన్‌దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పెద్దపల్లి పంచాయతీ శివునిపల్లె గ్రామానికి చెందిన దాసరి నారాయణమ్మ, చెవ్వుల ఓబులమ్మ, శాఖరాజుపల్లె పంచాయతీకి చెందిన బత్తల లక్ష్మీదేవిలు అంగవైకల్యం కావడంతో వారు సదరం సర్టిఫికెట్‌లు నకిలివిగా నిర్ధారించి పెన్షన్‌లను రద్దుచేశామని ఎంపీడీఓ జవహర్‌బాబు తెలిపారు.

రెండు సంవత్సరాలుగా పెన్షన్ వస్తుంది

నాపేరు దాసరి నారాయణమ్మ మాది సిద్దవటం మండలం శివునిపల్లె గ్రామం నాకు రెండు సంవత్సరాల నుంచి దివ్యాంగుల పెన్షన్ వస్తోంది. జగన్ ప్రభుత్వంలో వలంటీరు నెలనెల 1వ తేదీన నిద్ర లేపి నాకు పెన్షన్ డబ్బులు ఇచ్చేవారు. ప్రభుత్వం మారాక అధికారులు వచ్చి పెన్షన్ ఇస్తున్నారు. ఈ నెలలో నాకు పెన్షన్ ఇవ్వలేదు. తన వద్ద ఉన్న సదరం సర్టిఫికెటు నకిలీదని చెపుతున్నారు. ఇక పెన్షన్ నాకు వస్తుందా రాదా అని అడిగితే ఏమీ చెప్పడంలేదు.

రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులు


సుండుపల్లె: రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్, బేస్ బాల్ క్రీడా పోటీలకు ఎంపికైన సుండుపల్లె విద్యార్థులు

సుండుపల్లె : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అండర్–14, అండర్–17 సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ విభాగంలో ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయన్న తెలిపారు. అండర్–14 సాఫ్ట్ బాల్ విభాగంలో ఎస్.అభి, జి.కిరణ్ కుమార్, పి.జేష్ఠ, బేస్‌బాల్ విభాగంలో జి.కిరణ్ కుమార్, జి.వంశీ, ఎం.సంధ్యలు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. అలాగే అండర్–17 సాఫ్ట్ బాల్ విభాగంలో ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, బేబీ, బేస్‌బాల్ విభాగంలో ఉదయ్ కిరణ్, భరత్ కుమార్, బేబీలు ఎంపికయ్యారని చెప్పారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయన్న, ఉపాధ్యాయులు విద్యార్థులు క్రీడాపోటీలలో ఎంపిక కావడానికి కృషి చేసిన పీడీలు రవీంద్రరాజు, రాధారాణిలను అభినందించారు.

రాష్ట్రస్థాయికి వీరబల్లి విద్యార్థులు


కావ్యరెడ్డి

వీరబల్లి : మండలంలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న మాచిరెడ్డి కావ్య రెడ్డి కబడ్డీ పోటీలలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆ పాఠశాల పీఈటీ శేఖర్, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌లు తెలిపారు. అదే విధంగా వీరబల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు రెడ్డయ్య, ఫిజికల్ డైరెక్టర్ వేణు మాధవరాజులు తెలిపారు. అందులో సాఫ్ట్‌బాల్ అండర్–17 బాలుర విభాగంలో భరత్, నాసిర్, బాలికల విభాగంలో కావ్య, బేస్‌బాల్‌లో నాసర్‌లు ఎంపికైనట్లు తెలిపారు. అండర్–14 సాఫ్ట్‌బాల్‌లో వేణుగోపాల్, బాలికల విభాగంలో సాత్విక ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

గాలివీడు విద్యార్థులు


సందీప్


హరికృష్ణ

గాలివీడు : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు హైస్కూల్ విద్యార్థులు సందీప్, హరికృష్ణలు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయులు మోహిద్దీన్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వీరు అండర్–17 విభాగంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. మంగళవారం రామాపురంలో డా.బి.ఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో ఈ ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబరచి ముందంజలో నిలిచారు. రాష్ట్ర స్థాయి పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికవ్వడం పట్ల పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు గంగరాజు, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

పరామర్శ


మోహనరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఆకేపాటి

రాజంపేట రూరల్ : అనారోగ్య సమస్యలతో వైద్యం చేయించుకొని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న ఎర్రబల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పిండిబోయిన వెంకటసుబ్బయ్యను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అదే ఎర్రబల్లిలో గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బొమ్మవరం మోహన్‌రెడ్డి కుమారుడు మంజునాథరెడ్డి ఇటీవల ప్రమాధవశాత్తు మరణించాడు. మోహనరెడ్డి కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎమ్మెల్యే ఆకేపాటి వెంట వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ డి.భాస్కరరాజు, నాయకులు బి.శంకరరాజు, బి.సుబ్రమణ్యంరెడ్డి, ప్రభాకరరెడ్డి, రాంకోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దు


మండల కేంద్రంలో ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తున్న సీఐ వెంకట కొండారెడ్డి

గాలివీడు : రహదారులపై వాహనాలు అడ్డుగా ఉంచి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని లక్కిరెడ్డిపల్లి సీఐ వెంకట కొండారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గాలివీడులో పర్యటించిన ఆయన బస్టాండ్ నుంచి గేటు వరకు రహదారులపై అడ్డుగా ఉన్న వాహనాలను తొలగింపజేశారు. దుకాణాదారులు, నివాసాల ముందు రోడ్డుపై పార్కింగ్ చేసి ప్రమాదాలకు కారకులవ్వరాదన్నారు. పరిమితికి మించి ప్రయాణికులతో ఆటోలు నడపారదన్నారు. అంతేగాక దసరా సెలవులు సందర్భంగా ఊర్లకు వెళ్లేవారు చోరీలు జరగకుండా ఇళ్లలో విలువైన వస్తువులు, నగదు ఉంచరాదన్నారు. మండలంలో కోడిపందేలు, పేకాట, క్రికెట్ బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలపై గట్టి నిఘా ఉంచామన్నారు.

శాస్త్రవేత్తల సలహాలతో చీడపీడల నివారణ


రైల్వేకోడూరు అర్బన్: రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త శ్రీధర్

రైల్వేకోడూరు అర్బన్ : రైతులు తమ పొలాలలో చీడపీడల నివారణకు శాస్త్రవేత్తల సలహాలు పాటించాలని ఏఓ సుధాకర్, హెచ్ఓ భాస్కర్‌లు మంగళవారం తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని కేబుడుగుంటపల్లి, ఉర్లగడ్డపోడు, కంద్రిక గ్రామాలలో వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్త శ్రీధర్ ద్వారా రైతులకు అరటి, బొప్పాయి, మామిడి పంటలలో అధిక దిగుబడిపై సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటలు వేసే ముందు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. తరువాత చీడపీడల నివారణ, అధిక దిగుబడి రావడానికి అధికారుల సలహాలు పాటించాలని తెలిపారు.

ప్రతి రైతు ఉలవలు సాగు చేసుకోవాలి

వీరబల్లి : ప్రతి రైతు విధిగా ఉలవల పంటను సాగు చేయాలని మట్లి సర్పంచ్ సోమారపు నాగార్జునచారి అన్నారు. మంగళవారం ప్రభుత్వం నుంచి వచ్చిన సబ్సిడీ ఉలవ విత్తనాలను ఆయన స్థానిక రైతు భరోసా కేంద్రంలో రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఉలవ పంటను సాగు చేసి మంచి దిగుబడి సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో దిగుబడులు


ఓబులవారిపల్లె : ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారిణి మల్లిక మంగళవారం చిన్నఓరంపాడు, ఓబులవారిపల్లె గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తమలపాకు, అరటి పంట పొలాలను సందర్శించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. మండల వ్యవసాయ అధికారిణి మల్లిక మాట్లాడుతూ జీవన ఎరువులు గురించి రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయం వలన కలిగే ఉపయోగాలు, లాభాలను తెలియజేశారు. భూసార పరీక్షలు, సీసీఆర్‌సీ కార్డులు గురించి తెలియజేశారు. రైతులు తప్పనిసరిగా క్రాప్ బుకింగ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఏ పుల్లయ్య, ఐసీఆర్‌పీలు, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

విజయవాడ వరద బాధితులకు సహాయం


వరద సాయం అందిస్తున్న విద్యార్థులు, సిబ్బంది

పుల్లంపేట : పుల్లంపేటలోని శ్రీ ప్రత్యూష హైస్కూల్ విద్యార్థులు మంగళవారం చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్‌కు మండల విద్యాశాఖాధికారి జి.చక్రధర్ రాజు చేతులమీదుగా రూ. 52350లు విజయవాడ వరద బాధితుల సహాయార్థం డీడీ తీసి అమరావతికి పంపించారు. ఇంత మొత్తంలో ఫండ్ సేకరించిన విద్యార్థులను విద్యాశాఖాధికారి చక్రధర్ రాజు అభినందించారు.

అహింసే గాంధీ మహాత్ముని ఆయుధం


గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న టీచర్లు

పెనగలూరు : అహింసే గాంధీ మహాత్ముని ఆయుధమని చక్రంపేట జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గోపాల కృష్ణ అన్నారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా మంగళవారం ముందస్తుగా హైస్కూల్‌లో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్ముడి ఆలోచనలు, భావాలు, సిద్ధాంతాలు ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచాయని కొనియాడారు. విద్యార్థులకు గాంధీజీ జీవిత చరిత్ర గురించి తెలియజేశారు.